

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :96 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ మంగళవారం - 13 - అక్టోబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

# తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

## తిరుపతి స్వరూపం మారనుంది.. వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం




అమరావతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన . మిగతా 2 లో

## ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు




- బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం
- బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం-6 లేదు
- రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలి
- ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి

# రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి

## స్థానిక ఎన్నికల్లో పార్టీపరంగా ఇస్తాం

- జీసీలకు తెదేపా కోటా 40 శాతం!
- ప్రభుత్వం చేసిన మంచిని 'జయహో బీసీ..' పేరుతో ప్రజలకు వివరించండి
- 2024 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ శాతం ఓట్లు రావాలి
- ఇదే నేతల పనితీరుకు కొలమానం..
- గొడ్డలి పార్టీ మూతపడేలా కూటమి అభ్యర్థుల గెలుపు ఉండాలి



అమరావతి: 'ఎన్నికలు దగ్గర పడుతుండటం, ఇమేజ్ పడిపోవడంతో గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాల్ని ముమ్మరం చేస్తోంది. ఈ ఎన్నికలతో ఆ పార్టీకి, అభివృద్ధి నిరోధకులకు, రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి. అక్రమంగా ఆస్తులు సంపాదించిన జగన్ మనపై ఆరోపణలు చేస్తున్నారు. వివేకానందరెడ్డి హత్య మిగతా 2 లో

## 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు.. రాహుల్ సంచలన వ్యాఖ్యలు




- జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి
- అప్రూవర్‌గా మారాలని జ్ఞానేశ్‌కు రాహుల్ సూచన
- మోదీ, అమిత్ షా, దోవల్, అదానీ కలిసి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు
- జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య
- సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ

## జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్




- కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- నిందిత ఎంపీని కాంగ్రెస్ కాపాడుతోందన్న పురందేశ్వరి
- మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శ

# 2027 రుతుపవనాల నాటికి గోవాలో కాంగ్రెస్ సర్కార్!

- భూ మాఫియాకు, డ్రగ్స్ దందాకు బీజేపీ సర్కారు అండ
- తెలంగాణలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం
- 'గోయ్ రాఖోన్స్' యాత్రలో సీఎం రేవంత్ తదితరులు
- ఆక్రమణలు, కబ్జాలతో గోవాలో భూములు అన్యాక్రాంతం
- డ్రగ్స్‌తో తప్పుదారి పడుతున్న రాష్ట్ర యువత
- ఈ పరిస్థితులన్నీ మారాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి



హైదరాబాద్:'రావణుడు బీజేపీ అయితే, రాముడు కాంగ్రెస్. బీజేపీని ఓడించాలంటే ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలి. గోవా ప్రజలు రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారు. మూడోసారి ఆ పార్టీని నమ్మొద్దు. గోవాలో కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేసినా అది చివరకు బీజేపీకే ప్రయోజనం చేకూరుస్తుంది. జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోంది. మిగతా 2 లో

# స్థానిక ఎన్నికలు.. పొత్తు ప్రకారం జనసైనికులు పోటీలో నిలుస్తారు

## పోటీచేసే అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలి

- తెదేపా, భాజపా నాయకులకు ఎంత గౌరవం ఇస్తారో, తమ వాళ్లకూ అంతే మద్దతివ్వాలి
- 'నేను పార్టీ పెట్టినప్పుడు ఇక్కడి యువతంతా ఎర్ర తువ్వాళ్లు వేసుకుని వచ్చింది
- అధికారంలోకి వస్తామో రామో తెలియదు.. వారికి తెలిసింది పోరాటమే.. ఆ ఎర్ర కండువానే ఆయుధం




పోలవరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకవాడ గ్రామసభలో ఆయన ప్రసంగిస్తూ.. స్థానిక సమరానికి శంఖారావం పూరించారు. స్థానిక ఎన్నికల్లో మిగతా 2 లో




## రోడ్లపై కాదు.. ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి: ఈటల రాజేందర్

- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన
- ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య
- ఆధారాలుంటే ఎన్నికల సంఘాన్ని కలవాలని ప్రతిపక్షాలకు సూచన

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

## కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్




- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు

## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు..

## విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్

- ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు
- ఈ మేరకు పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ
- 5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు
- విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటన
- త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ . మిగతా 2 లో




## 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు.. ఆమ్రపాలికి కీలక శాఖ

- ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు
- ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి
- తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
- మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



## ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు

ఢిల్లీ: బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునేవారు నింపాల్సిన ఫారం-6 లో తాము ఎలాంటి సవరణలనూ ఆమోదించలేదని స్పష్టం చేసింది. తాము బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం-6 లేదని పేర్కొంది. రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కొత్త ఫారం డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం చేసిన ప్రకటనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫారం-6 లో ఎన్నికల సంఘం మార్పులు చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అంతటితో ఆగకుండా అందరినీ నమ్మించేందుకు ఆ ఫారాన్ని సుప్రీంకోర్టు ఆమోదించినట్లు సెప్టెంబరు 26న తప్పుడు ప్రకటన జారీ చేసిందని ఆరోపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్.. టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

హైదరాబాద్: తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికలు.. పొత్తు ప్రకారం జనసైనికులు పోటీలో నిలుస్తారు: పవన్

పోలవరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకవాడ గ్రామసభలో ఆయన ప్రసంగిస్తూ.. స్థానిక సమరానికి శంఖారావం పూరించారు. స్థానిక ఎన్నికల్లో జనసైనికులు పొత్తు ప్రకారం పోటీ చేస్తారని.. తెదేపా, భాజపా నాయకులకు ఎంత గౌరవం ఇస్తారో, తమ వాళ్లకూ అంతే మద్దతివ్వాలని కోరారు. 'నేను పార్టీ పెట్టినప్పుడు ఇక్కడి యువతంతా ఎర్ర తువ్వాళ్లు వేసుకుని వచ్చింది. అధికారంలోకి వస్తామో రామో తెలియదు.. వారికి తెలిసింది పోరాటమే.. ఆ ఎర్ర కండువానే ఆయుధం. 2014లో ఒక్క పదవీ ఆశించకుండా కూటమికి పనిచేశారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి చంద్రబాబును జైల్లో పెట్టింది. రోడ్లపైకి ఎవరూ రాని సమయంలో జనసైనికులు, వీరమహిళలు వచ్చి రాష్ట్రానికి భరోసా, ధైర్యం ఇచ్చారు. గత ఎన్నికల్లో నేను రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేశా. స్థానిక ఎన్నికలు మీ భవిష్యత్తు.. మీ అవసరాల కోసం' అని అన్నారు. మూడు పార్టీలూ బాగుండాలని.. ఇప్పటికే జనసేన చాలా త్యాగం చేసిందని.. జనసైనికులు, వీరమహిళలు తగిన ప్రాతినిధ్యం వహించేందుకు అండగా నిలవాలని కోరారు.

## రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి

అమరావతి: 'ఎన్నికలు దగ్గర పడుతుండటం, ఇమేజ్ పడిపోవడంతో గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాల్ని ముమ్మరం చేస్తోంది. ఈ ఎన్నికలతో ఆ పార్టీకి, అభివృద్ధి నిరోధకులకు, రౌడీలు, రప్పా రప్పా టీంలకు బుద్ధి చెప్పాలి. అక్రమంగా ఆస్తులు సంపాదించిన జగన్ మనపై ఆరోపణలు చేస్తున్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అంతిమ లబ్ధిదారయిన జగన్.. ఆ విషయంలో ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఈడీని మనమే పంపామని ఆరోపణలు చేస్తున్నారు' అని చంద్రబాబు విరుచుకుపడ్డారు. 'బీసీలకు రిజర్వేషన్లు దక్కకూడదని, స్థానిక ఎన్నికలు జరగకూడదని గొడ్డలి పార్టీ న్యాయస్థానాలకు వెళ్లింది. రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయాలని చూసింది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు.. 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారు. వారికి న్యాయం చేయాలని ఏనాడూ భావించలేదు' అని సీఎం దుయ్యబట్టారు. రాజీవ్‌రంజన్ మిశ్రా కమిటీ సిఫార్సులు ఆమోదించి, బీసీలకు వీలైనంత ఎక్కువ మేలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు భంగం కలిగించకుండా బీసీలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 40 శాతం వరకూ రిజర్వేషన్లు కల్పించేలా కసరత్తు చేస్తున్నామని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచి తెలిసేలా 'జయహో బీసీ.. జనాభాలో సగం-కూటమి ఇచ్చింది బలం' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ శాతం ఓట్లు పడాలని, ఇదే నేతల పనితీరుకు కొలమానమని పేర్కొన్నారు. దీన్నిబట్టే నేతలకు రేటింగ్స్ ఇస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల సన్నద్ధతపై మంత్రులు, తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇన్‌ఛార్జులు, నియోజకవర్గ పరిశీలకులు, ముఖ్యనేతలతో ఆదివారం చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారం, కూటమి పార్టీలతో సమన్వయం, ప్రత్యర్థి పార్టీల దుష్ప్రచారాల్ని తిప్పికొట్టడంపై వారికి దిశానిర్దేశం చేశారు.

'మనం కూటమిలో ఉన్నాం. మిత్రధర్మం చాలా ముఖ్యం. కూటమి పార్టీల మధ్య పైస్థాయిలో ఎలాంటి సమన్వయం ఉందో.. క్షేత్రస్థాయిలోనూ అలాగే ఉండాలి. విభేదాలు, అపోహలకు తావివ్వొద్దు. నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో మూడు పార్టీలు కలిసి సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. మిత్రపక్షాలతో కలిసి ఎన్నికల ప్రచారం చేయాలి. తటస్థుల్ని పార్టీ సానుభూతిపరులుగా మార్చాలి. ప్రత్యర్థి పార్టీల వారిని తటస్థుల్ని చేయాలి. రాబోయే 50 రోజులు ఎవరికీ మినహాయింపు లేదు. కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి. గెలుపు, నిజాయతీ, సమర్థత, సోషల్ రీ-ఇంజినీరింగ్ వంటి అంశాల్ని బేరీజు వేసుకుని అభ్యర్థుల్ని ఎంపిక చేస్తాం. గొడ్డలి పార్టీ మూతపడేలా ఈ ఎన్నికల్లో కూటమి గెలుపు ఉండాలి. ఎమ్మెల్యేలంతా కార్యకర్తల మనోభావాల్ని బట్టి నడుచుకోవాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

డ్రామాలాడేవారిని ఉపేక్షించం..

నిజాయతీగా పనిచేయకుండా.. డ్రామాలాడేవారిని ఉపేక్షించబోమని చంద్రబాబు హెచ్చరించారు. 'స్థానిక ఎన్నికల్ని ఆషామాషీగా తీసుకోవద్దు. కూటమి బలం మరింత పెరగాలంటే ఈ ఎన్నికలు కీలకం. ఇప్పటివరకూ సంక్షేమం కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశాం. చెత్త పన్ను రద్దు చేశాం. చక్కటి రోడ్లు వేశాం. ఇరిగేషన్‌కు పూర్వ వైభవం తెచ్చాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి చేశాం. పల్లె పండుగకు రూ.11 వేల కోట్లు, జేజేఎం పనులకు రూ.30 వేల కోట్లతో శంకుస్థాపన చేశాం. 5 లక్షల ఇళ్లల్లో సామూహిక గృహప్రవేశాలు చేపట్టాం. మరో 3 లక్షల ఇళ్లకు భూమిపూజ చేశాం. పుర, నగరపాలికల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.11,359 కోట్ల విలువైన పనులు చేపట్టాం. 16.48 లక్షల ఎకరాలను 22ఏ నుంచి తొలగించాం. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని చంద్రబాబుపేర్కొన్నారు. ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని, వాటిని క్లస్టర్‌ల వరకూ అందేలా చూడాలన్నారు.

## 2027 రుతుపవనాల నాటికి గోవాలో కాంగ్రెస్ సర్కార్!

హైదరాబాద్:'రావణుడు బీజేపీ అయితే, రాముడు కాంగ్రెస్. బీజేపీని ఓడించాలంటే ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలి. గోవా ప్రజలు రెండుసార్లు బీజేపీని నమ్మి మోసపోయారు. మూడోసారి ఆ పార్టీని నమ్మొద్దు. గోవాలో కాంగ్రెస్‌కు కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేసినా అది చివరకు బీజేపీకే ప్రయోజనం చేకూరుస్తుంది. జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోంది. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారు. గోవాలో.. కాంగ్రెస్ పార్టీ కోసం కాదు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలి. దేశంలో నైరుతి రుతుపవనాలు తొలుత కేరళలో ప్రవేశించి, ఆ తర్వాత గోవాకు చేరుకుంటాయి. 2026 రుతుపవనాల సమయంలో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2027 రుతుపవనాల నాటికి గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది..' అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు త్రివర్ణ పతాకం ఎగరడం ఖాయమని అన్నారు.

గోవాలో భూముల అన్యా క్రాంతం, డ్రగ్స్ దందాకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆక్రమణలు, కబ్జాలతో భూములు అన్యాక్రాంతం అయ్యాయని, మరోవైపు డ్రగ్స్ వ్యాపారానికి బీజేపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇవ్వడంతో యువత తప్పుదారి పట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను సరిచేయాలంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గోవాలో భూముల అన్యాక్రాంతం, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును పరిరక్షించాలనే లక్ష్యంతో గోవా కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'గోయ్ రాఖోన్న్' యాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు.

'గోవా ప్రజలు బీజేపీ పాలనతో విసిగిపోయారు. మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోనే పరాయివారిగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ గోవాకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్య క్రమాల నేపథ్యంలో రాలేకపోయారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రతినిధిగా నన్ను గోవాకు పంపించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రాష్ట్రా న్ని అభివృద్ధి చేయకుండా ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారు.

అందుకే ప్రజలు ఆయన్ను 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారు. 'నషా ముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గోవాలో ఈ సమస్యను ఎందుకు అరికట్టడం లేదు? అనేది ప్రజలు ఆలోచించుకోవాలి. గోవా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

అమరావతి: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది. రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

### మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..

ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. "మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

### సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

200 మంది అధికారులు టచ్‌లో

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

### రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

## ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా? ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

## ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు.. విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి.

రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ఉంది:
ఎస్టీ (ఒకటి): మంగళగిరి-తాడేపల్లి
ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు
బీసీ - మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ
బీసీ - జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు
జనరల్ - మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం
అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ా×=) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## రోడ్లపై కాదు.. ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి: ఈటల రాజేందర్

హైదరాబాద్: ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఈటల... ప్రతిపక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. "ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించండి. అంతేగానీ, ఇలా రోడ్డెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు" అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

## 11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు.. ఆమ్రపాలికి కీలక శాఖ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

ఇతర ముఖ్య నియామకాలు ఇలా ఉన్నాయి:

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి. కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు. బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి. ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి. ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది. గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.

ఇద్దరికి అదనపు బాధ్యతలు

ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన.. చార్జీల తగ్గింపుకు కసరత్తు

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ చార్జీలపై తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్ష చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్‌కు రూ. 400 (మెట్రోకు రూ. 300, ఆర్టీసీకి రూ. 100), నెలవారీ పాస్‌కు రూ. 8,500 (మెట్రోకు రూ. 7,000, ఆర్టీసీకి రూ. 1,500) చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ ధరల నిర్ణయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చార్జీలను పునఃపరిశీలించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడమేనని, ప్రజలపై అదనపు భారం మోపడం తమ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాలు, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై అందరికీ అందుబాటులో ఉండేలా ధరలపై సరైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా ప్రయాణికులకు మేలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి: సామాన్య ప్రజలకు ఊరట కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రైతు బజార్ల ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని సరసమైన ధరకే అందించేందుకు శ్రీకారం చుట్టింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం సన్నబియ్యాన్ని కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఇప్పటికే రైతు బజార్లలో బీపీటీ రకం బియ్యం కిలో రూ. 49కు అందుబాటులో ఉండగా, తాజాగా కేఎన్ఎం రకాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాకింగ్‌ను పంపిణీ చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధర కిలో రూ. 90 వరకు ఉన్న తరుణంలో, ప్రభుత్వ నిర్ణయం సామాన్యులకు భారీ ఊరటనివ్వనుంది. నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు చేరవేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ విక్రయాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని భవానీపురం రైతు బజార్‌లో నేడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమీపంలోని రైతు బజార్లను సంప్రదించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

## జేఎన్‌యూ ఘటన: రాహుల్, ప్రియాంక మౌనంపై పురందేశ్వరి ఫైర్

అమరావతి: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో కాంగ్రెస్ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన ఘటనపై ఆ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మౌనంగా ఉండటంపై బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆరోపణ కాదని, నిజమని తేలిన వాస్తవమని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై పురందేశ్వరి మాట్లాడుతూ... "జేఎన్‌యూ పరిపాలన విభాగం నియమించిన అంతర్గత విచారణ కమిటీ నివేదికలో, నిందితుడైన కాంగ్రెస్ ఎంపీ 11 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు స్పష్టంగా తేలింది. కాంగ్రెస్ ఎంపీపై ఇంతటి తీవ్రమైన నేరం రుజువైనప్పటికీ రాహుల్, ప్రియాంక ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం" అని అన్నారు. పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేసే రాహుల్ గాంధీ, ఈ విషయంలో మౌనంగా ఉంటూ నిందితుడికి పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. కనీసం ఒక ప్రకటన కూడా చేయకపోవడం అంటే నిందితుడిని కాపాడటమేనని విమర్శించారు. ఈ దుష్ప్రవర్తనకు పాల్పడిన ఎంపీని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో బహిష్కరించాల్సిందని, కానీ అతనికి రక్షణ కల్పించడం ద్వారా ఆ పార్టీ ద్వంద్వ వైఖరి బయటపడిందని పురందేశ్వరి దుయ్యబట్టారు. మహిళల భద్రత, గౌరవం పట్ల కాంగ్రెస్ నాయకులకు ఉన్న చిత్తశుద్ధిని ఆమె ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే కఠినమైన చట్టపరమైన, రాజకీయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ మహిళా మోర్చా పురందేశ్వరి నేతృత్వంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపట్టింది.

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త

జనరల్ న్యూస్
మంగళవారం - 13 - అక్టోబర్ - 2026

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి పనులకు రూ 50 వేల వితరణ



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :కీ. శే. చక్రపాణి జ్ఞాపకార్థం వారి తల్లి రిటైర్డ్ టీచర్ దోనేపూడి రాజకుమారి రూ 25వేలు, వారి పిన్ని కుమారులు, సోదరులు కొడవటికంటి భాను వెంకట నాయుడు, కొడవటికంటి చందు రామ్ నాయుడు, రూ 25వేల వెరసి మొత్తంగా రూ 50వేలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఘంటసాలకు అభివృద్ధి నిమిత్తం కీ. శే. చక్రపాణి జ్ఞాపకార్థం వారి పెద్దకర్మ రోజున డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ చేతుల మీదుగా జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణకి వారి బంధువుల సమక్షంలో విరాళాన్ని అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ దాతలను అభినందించి, డాక్టర్ ప్రమోద్ స్టాఫ్ సేవలకు గ్రామస్థుల స్పందనే ఈ విరాళం అని పేర్కొన్నారు. పి హెచ్ సి ఫార్మసిస్ట్ కృష్ణ . హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు కుటుంబసభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు...

## ఘంటసాలలో గాయత్రీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల కేంద్రమైన ఘంటసాల సత్రం సెంటర్లో గల రజకుల రామాలయం వద్ద దేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం గాయత్రీ దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పోతర్లంక శ్రీనివాసరావు, రజిని దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకము, గాయత్రీ దేవి సహస్రనామార్చన, కుంకుమ పూజ అర్చకులు సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో జరిపారు. కమిటీ అధ్యక్షురాలు ఆదిలాల దుర్గాభవాని, పోతర్లంక వెంకటేశ్వరరావు, ప్రసాదు, సత్యనారాయణ, తూములురి సీతారామయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళంలో గాయత్రీ దేవిగా అమ్మవారు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న ముదిరాజుల రామాలయ ఆవరణలో దేవి శరన్నవరాత్రులు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వగా, రుత్వికులు వాడపల్లి శ్రీరామ్ గణేష్ గాయత్రి దేవి సహస్రనామార్చన, కుంకుమార్చన ఎర్రబనేని శివరామకృష్ణ, శారద దంపతులుచే నిర్వహించి అమ్మవారికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ ఆత్కూరు సీతారామరాజు. కమిటీ సభ్యులు ఆత్కూరి నాగరాజు, దానబోయిన శ్రీనివాసరావు, బోడి రాఘవరాజు, ఎర్రబనేని వెంకటేష్, కొంగితల కృష్ణవేణి, బోడి ఇందిర, ఆత్మకూరు కుమారి, ఎర్రబనేని రామలక్ష్మి, బోడి సుబ్బలక్ష్మి లతో పాటు భక్తులు విరివిగా పాల్గొని విశేష పూజ నిర్వహించారు.

## ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మండలి రాజా ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన వెంకట్రామ్



అవనిగడ్డ అక్టోబర్ 12 శ్రీవార్త:అశ్వారావుపాలెంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మండలి వెంకట కృష్ణారావు, పంద్రాజు నాగభూషణం సభా వేదిక, పార్క్, స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు విగ్రహం ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. గ్రామ మాజీ సర్పంచ్, జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహక్ దళ్ సభ్యులు పంద్రాజు లంకమ్మ ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.15లక్షలు వ్యయంతో గ్రామంలో నూతన పార్క్, స్వర్గీయ ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు నూతన విగ్రహం ఏర్పాటు చేశారు మంగళవారం సంగమేశ్వరం కార్యక్రమం అనంతరం జరిగే ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ బోర్డు చైర్మన్ కొణిదెల నాగబాబు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ విచ్చేసి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ సోమవారం గ్రామంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, మాజీ ఎంపీటీసీ కటికల వసంత్, సొసైటీ చైర్మన్ యలవర్తి చిన్నా, జనసేన నాయకులు గుడివాక శివరావు తదితరులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం మండలం సీతారాంపురంలో రైతు సదస్సు నేలను ఏడాది పొడవునా పంటలతో కప్పి ఉంచాలి



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కోవడానికి చెట్లు పెంచడంతో పాటు నేలను అన్ని ఋతువులలో పంటలతో కప్పి ఉంచడం తప్పనిసరి అని జిల్లా నేచురల్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి అన్నారు.మచిలీపట్నం మండలం సీతారాంపురం ప్రాథమిక సహకార పరపతి సంఘం లిమిటెడ్, ఏస్ ఎన్ గొల్లపాలెం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రైతుల సదస్సు జరిగింది.ఈ సదస్సుకు పీఏసీఎస్ అధ్యక్షులు ఈడే రాంబాబు అధ్యక్షత వహించగా, కృష్ణా జిల్లా జాయింట్ డైరెక్టర్ శ్రీమతి జ్యోతిరమణి, ఏడీఏ రమాదేవి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాసరావు, నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి, మండల వ్యవసాయ అధికారి ఎం. రామ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. నేడు ప్రపంచం మొత్తం ఎల్ నినో తీవ్ర ప్రభావానికి లోనవుతోందని, భూమి వేడెక్కడాన్ని తగ్గించాలంటే నేలను ఎప్పుడూ ఖాళీగా ఉంచకుండా పచ్చదనంతో కప్పి ఉంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించాలని పిలుపునిచ్చారు.జాయింట్ డైరెక్టర్ జ్యోతిరమణి మాట్లాడుతూ.. రబీ సీజన్ లో మినుము పంట వేయని గ్రామాలలోని భూముల్లో జీలుగ పంట వేసేందుకు వ్యవసాయ శాఖ 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రోద్బలంతో ఏపీ సీడ్స్ సంస్థ బైబ్యాక్ విధానంలో రైతుల వద్ద నుండి జీలుగ విత్తనాలను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## అన్నదానం చేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వర రావు.

59 నెలలుగా నిరంతర అన్నదానం.. కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు అభినందనీయం.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం.కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు.



విజయవాడ శ్రీ వార్త న్యూస్:పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా స్వర్గీయ కళ్ళే లలిత ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం. అజిత్‌సింగ్‌నగర్‌లోని కళ్ళే లలిత వీధిలో గత 59 నెలలుగా ప్రతి నెలా 12వ తేదీన క్రమం తప్పకుండా అన్నసమారాధన నిర్వహిస్తూ ట్రస్ట్ పేదలకు అండగా నిలుస్తోంది. ఈ సందర్భంగా అన్నార్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భోజనాలు స్వీకరించారు.ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు తొలుత స్వర్గీయ కళ్ళే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుంచి ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రతి నెలా 12వ తేదీన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు రుచికరమైన స్వీట్లు, గారెలు, చికెన్, గుడ్డు, సాంబారు,పెరుగు, పచ్చడితో కూడిన భోజనాన్ని అందిస్తున్నామని చెప్పారు. అన్నదానంతో పాటు కళ్ళే లలిత ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, సైకిళ్ల పంపిణీ, ఏడాది పొడవునా చల్లని తాగునీరు అందించేందుకు కూలింగ్ ఫ్రిజ్‌తో చలివేంద్రం ఏర్పాటు, పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ, చెత్త సేకరణకు డస్ట్‌బిన్ల అందజేత వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.అలాగే రోగులకు ఉచితంగా మందులు, భోజనం అందించడంతో పాటు పేద మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు తోపుడు బండ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతామహాలక్ష్మి, ముప్పూరి హరీష్, జయదుర్గా, ఎం. జశ్విన్, జి. ధ్రువన్, అనిల్, ప్రసాద్ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లాలో పోర్టు ఆధారిత పరిశ్రమలు, ఆక్వా ప్రాసెసింగ్‌కు విస్తృత అవకాశాలు

రైతుల ఆదాయం పెంపు, కొత్త పెట్టుబడుల ఆకర్షణకు కార్యాచరణ రూపొందించాలి....కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:అమరావతి ఆర్థిక ప్రాంత అభివృద్ధి ప్రణాళికలో కృష్ణా జిల్లాకు ఉన్న ప్రత్యేకతలు, ఆర్థిక అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని, కొత్త పెట్టుబడులు,ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు. వ్యవసాయం, ఆక్వాకల్చర్‌తో పాటు మచిలీపట్నం పోర్టు ఆధారంగా పరిశ్రమల అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, జిల్లాను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు.సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో అమరావతి ఆర్థిక ప్రాంత అభివృద్ధి ప్రణాళిక (ఏఈఆర్పి) రూపకల్పనపై సంబంధిత అధికారులు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సిఆర్డిఏ) నియమించిన వ్యూహాత్మక సహాయక సంస్థ ఎల్ఈఏ అసోసియేట్స్ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రిన్సిపల్ కన్సల్టెంట్ స్మిత జె. కుట్టికాట్ ప్రణాళిక లక్ష్యాలు, అధ్యయన విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.అమరావతి ఆర్థిక ప్రాంతంలో భాగంగా గుర్తించిన తొమ్మిది జిల్లాల ఆర్థిక బలాలు, పెట్టుబడులకు అనువైన రంగాలు, అభివృద్ధికి ఎదురవుతున్న సమస్యలను అధ్యయనం చేసి సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నట్లు కన్సల్టెంట్ వివరించారు. ఇందులో భాగంగా కృష్ణా జిల్లాలో ఇప్పటికే బలంగా ఉన్న రంగాలతో పాటు కొత్తగా అభివృద్ధి చేయగల రంగాలను గుర్తించి, వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం, పెట్టుబడుల సమీకరణ మార్గాలను ప్రతిపాదించనున్నట్లు తెలిపారు.జిల్లాలో వ్యవసాయం, ఆక్వాకల్చర్ ప్రధాన ఆర్థిక వనరులుగా ఉన్నప్పటికీ, రైతుల ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదనే అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. సాగు ఖర్చులు పెరగడం, కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వరదలు, తుపానులు, కరవు వంటి ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయని అధికారులు చర్చించారు. వరి, మినుము పంటలతో పాటు ఆయిల్‌పామ్, ఇతర పప్పుధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం, ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.ఆక్వాకల్చర్ రంగానికి సంబంధించి అంతర్జాతీయ మార్కెట్లపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించి, ఇతర దేశాలకు ఎగుమతులను విస్తరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఆక్వా రైతులకు రుణాలు, బీమా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, ఉత్పత్తులకు విలువ జోడించడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి.మచిలీపట్నం పోర్టును కేంద్రంగా చేసుకుని పోర్టు ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి యూనిట్లు, శీతల గిడ్డంగులు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. రహదారులు, రైల్వేలు, జలరవాణా వ్యవస్థలను సమన్వయం చేయడం ద్వారా సరుకు రవాణా సులభతరం చేసి, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు అవసరమైన చర్యలను ప్రణాళికలో పొందుపరచాలని సూచించారు. పర్యాటకం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి, స్థానిక యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ కల్పించడం వంటి అంశాలపైనా దృష్టి సాధించాలని ఆయన తెలిపారు.జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూముల లభ్యత, ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలను కూడా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధుల సమీకరణతో పాటు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో చేపట్టగల ప్రాజెక్టులను గుర్తించాలని సూచించారు.అమరావతి ఆర్థిక ప్రాంత అభివృద్ధి ప్రణాళికలో భాగంగా తక్షణం చేపట్టగల ప్రాజెక్టులను 12 నెలల్లోగా, స్వల్పకాలిక ప్రాజెక్టులను ఒకటి నుంచి మూడేళ్లలో, మధ్యకాలిక ప్రాజెక్టులను మూడు నుంచి ఏడేళ్లలో, దీర్ఘకాలిక ప్రాజెక్టులను ఏడు నుంచి 22 ఏళ్లలో అమలు చేసేలా కార్యాచరణ రూపొందించనున్నారు. జిల్లాల నుంచి సేకరించిన వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, సంబంధిత శాఖల సూచనల ఆధారంగా ప్రాధాన్యతా ప్రాజెక్టులను గుర్తించి, వాటి అమలుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయనున్నట్లు ప్రిన్సిపల్ కన్సల్టెంట్ వివరించారు కృష్ణా జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులకు అదనపు విలువను జోడించడం, రైతుల ఆదాయాలను పెంచడం, పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను విస్తరించడం ఈ ప్రణాళికలో కీలక అంశాలుగా ఉండనున్నాయని ఆమె వివరించారు.సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు జ్యోతి రమణి, జె జ్యోతి, జిల్లా గణాంక శాఖ ఏడి కే పద్మజ, డిప్యూటీ అర్థగణాంక అధికారి ఆనంద్, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి రామలక్ష్మణరావు, మత్స్య, ప్రకృతి వ్యవసాయం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తండ్రిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తుకు భరోసా...

స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం..

రూ.90 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పై కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రశంసలు.



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:ఆ కుటుంబంలో ఒక విషాదం అలుముకుంది. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. భర్తను కోల్పోయిన భార్యకు కన్నీళ్లే మిగిలాయి. తండ్రి ప్రేమకు దూరమైన ఇద్దరు చిన్నారులకు తమ జీవితంలో ఎదురైన, ఈ తీరని లోటు మాటల్లో చెప్పలేనిది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబానికి భవిష్యత్తుపై ఎన్నో ఆందోళనలు. ఇలాంటి క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా నిలిచి, తండ్రిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తుకు భరోసా కల్పించే



దిశగా స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రశంసించారు.మచిలీపట్నం సమీపంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన పల్లేటి రాజు (20) ఆగస్టు 15న సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మరుసటి రోజు ఆయన మృతదేహం లభ్యమైంది. చిన్న వయసులోనే కుటుంబానికి ఆధారమైన రాజు మృతితో ఆయన భార్య, ఇద్దరు చిన్నారులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆ కుటుంబానికి ఎదురైన ఈ విషాదం మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేసే ఘటనగా నిలిచింది.తండ్రిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తు ఏమిటన్న ఆలోచనతో స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ రఫీ చొరవ తీసుకున్నారు. బాధిత కుటుంబాన్ని సంప్రదించి, మృతుడు రాజు భార్యతో మాట్లాడి, చిన్నారి భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించాలనే సంకల్పంతో పోస్టాఫీసులో చిన్నారి పల్లెటి వాత్సల్య కి రూ.90,000 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ మొత్తం చిన్నారి భవిష్యత్తుకు కొంతమేర భరోసాగా నిలవాలనే ఉద్దేశంతో ట్రస్ట్ ఈ సహాయాన్ని అందించింది.కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, తండ్రిని కోల్పోయిన చిన్నారుల రేపటి జీవితంపై ఆశలు చిగురింపజేసే ప్రయత్నం చేయడం ట్రస్ట్ సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమనే సందేశాన్ని ఈ కార్యక్రమం సమాజానికి చాటిచెప్పింది.పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, ఇప్పుడు ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ తన సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ముఖ్యంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు విద్యను అందించడం, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే చిన్నారులకు చేయూతనివ్వడం, ఆకలితో అలమటించే నిరుపేదలకు ఆహారం అందించడం వంటి లక్ష్యాలతో ట్రస్ట్ ముందుకు సాగుతోంది.ఈ సందర్భంగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, సమాజంలో ఎంతోమంది నిరుపేదలు కనీస అవసరాలైన ఆహారం, విద్య కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి అండగా నిలిచేందుకు స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు రావడం ఆదర్శప్రాయమన్నారు. పేదలకు అన్నదానం చేయడంతో పాటు, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల భవిష్యత్తు గురించి ఆలోచించి ఆర్థిక భరోసా కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ట్రస్ట్ ఫౌండర్ షేక్ రఫీ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలు, నిరుపేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు షేక్ రఫీ మాట్లాడుతూ, సమాజంలో అవసరాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, పేదల ఆకలి తీర్చడం, విద్యకు దూరమవుతున్న పిల్లలకు అండగా నిలవడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం ద్వారా వారిలో ధైర్యాన్ని నింపాలని భావిస్తున్నామన్నారు.తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు విద్యాపరంగా సహాయం అందిస్తూ, వారి భవిష్యత్తుకు తోడ్పడేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి అందించిన సహాయం...ఆ చిన్నారి భవిష్యత్తుపై నింపిన ఆశ. కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తూ స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు సాగడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్విఘ్న ఇన్ఫ్రా చీతిరాల మురళీ మోహన్, కే సుజాత, బోయిన నాగరాజు, కే రవీంద్రబాబు, నార్కెడిమిల్లి ప్రశాంత్, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, దుర్గా, కన్యా, అంబటి శేషు బాబు, సామ సునిల్, పెల్లేటి ప్రమీల, కే. రాజు, ఏం డి. భాషి, తదితరులు భాగస్వాములు అయ్యారు..

## ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలో 4(1)(బి) సమాచారం మాయం -

నోటీసు బోర్డులో 17 అంశాల సమాచారం ఏర్పాటు చేయాలని ఆర్టీఐ కార్యకర్తలు ఫిర్యాదు



ఉయ్యూరు శ్రీ వార్త న్యూస్: సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 21 సంవత్సరాలు గడుస్తున్నా, చట్టాన్ని అమలు చేయాల్సిన ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలోనే సెక్షన్ 4(1)(బి) కింద ప్రదర్శించాల్సిన 17 అంశాల సమాచారం నోటీసు బోర్డులో లేకపోవడంపై ఆర్టీఐ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.సమాచార హక్కు చట్టాన్ని భారత పార్లమెంట్ 2005 జూన్ 15న ఆమోదించగా, అదే ఏడాది అక్టోబర్ 12 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన కీలక సమాచారాన్ని చట్టం అమలులోకి వచ్చిన 120 రోజుల్లోగా ప్రచురించి, కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించాల్సి ఉంది.17 అంశాలలో కార్యాలయ విధులు, బాధ్యతలు, అధికారుల అధికారాలు, ఉద్యోగుల వివరాలు, అమలు చేస్తున్న చట్టాలు, ఉద్యోగుల నెలవారీ వేతనాలు, బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, ప్రజా సమాచార అధికారుల పేర్లు, లబ్ధిదారుల వివరాలు తదితర సమాచారం ఉండాలి. ఈ సమాచారం ప్రభుత్వ వెబ్ సైట్ తో పాటు కార్యాలయ నోటీసు బోర్డుపై కూడా అందుబాటులో ఉండాలని నిబంధన.అయితే ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలో ఈ సమాచారం ఎక్కడా కనిపించడం లేదని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంపొందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు.ఈ మేరకు 4(1)(బి) సమాచారాన్ని వెంటనే నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్డీఓ శ్రీమతి వై.ఎస్. కరుణ కుమారికి ఆర్టీఐ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే సమాచార హక్కు చట్ట నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కార్యకర్తలు జంపాన శ్రీనివాసగౌడ్, బేతపూడి జోగేశ్వరరావు, బి. దుర్గా ప్రసాద్, మరీదు సాంబశివరావు, బొల్లా శివపార్వతి, గుంజా హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తులు రాయించుకుని 80 ఏళ్ల తల్లిని ఇంటి నుండి గెంటేసిన కుమారులు

రేకుల షెడ్డులో సీనియర్ సిటిజన్ ఆవేదన





ఉయ్యూరు శ్రీ వార్త న్యూస్:కష్టపడి పెంచిన కొడుకులే ఆస్తులు రాయించుకుని 80 ఏళ్ల తల్లిని ఇంటి నుండి గెంటేయడంతో రెండేళ్లుగా రేకుల షెడ్డులో తలదాచుకుంటున్న వృద్ధురాలి కన్నీటి గాథ ఉయ్యూరు మండలం బోళ్లపాడు గ్రామంలో వెలుగు చూసింది.వివరాల్లోకి వెళితే..బోళ్లపాడు గ్రామానికి చెందిన 80 ఏళ్ల సీనియర్ సిటిజన్ కళ్యం రామకోటమ్మ భర్త కళ్యం లక్ష్మారెడ్డి 07.05.2007న మరణించారు. వారికి కాటూరు గ్రామంలో ఆర్.ఎస్ నెంబర్లు 92/3, 390/1సి, 390/2, 390/3, 390/4, 394/1లలో 10.50 సెంట్ల వ్యవసాయ భూమి, బోళ్లపాడు గ్రామంలో సర్వే నెం 16/2 లో గల డోర్ నెం. 5-103 (10 సెంట్ల ఇంటి స్థలం) లో గల 6 గదుల డాబా ఇల్లు ఉన్నాయి.22.08.2007న రామకోటమ్మ తన ఇద్దరు కుమారులు 1. కళ్యం ఆవలరెడ్డి, 2. కళ్యం శ్రీనివాసరెడ్డి, కుమార్తె కోల్లి ధనలక్ష్మిలతో కలిసి ఆస్తికి సంబంధించి వాటాల జాబితా వ్రాసుకున్నారు. రిజిస్టర్ డాక్యుమెంట్ నెం. 4425/2007.జాబితా వ్రాసుకున్న అనంతరం వ్యవసాయ భూమిని తమ పేర స్వాధీనం చేసుకుని, అందులో కొంత భాగాన్ని అమ్ముకుని వచ్చే ఆదాయాన్ని వారే అనుభవిస్తున్నారు.పెద్ద కుమారుడు ఆవలరెడ్డి ఇంటిని స్వాధీనం చేసుకోగా, అతని మరణానంతరం ఆవలరెడ్డి భార్య కళ్యం సుధారాణి ఇంటిని స్వాధీనం చేసుకుని అత్తగారైన రామకోటమ్మను ఇంటి నుండి గెంటివేసింది.దీంతో రెండు సంవత్సరాల నుండి రామకోటమ్మ ఒక చిన్న రేకుల షెడ్డులో తలదాచుకుంటూ, అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది.తనకు ఏ మాత్రం సహాయం చేయని కుమారులపై ఉన్న రిజిస్ట్రేషన్లను రద్దు పరిచి, తనకు చెందాల్సిన 10.50 సెంట్ల వ్యవసాయ భూమిని, 10 సెంట్ల ఇంటి స్థలంలో గల 6 గదుల డాబాను తిరిగి తనకు స్వాధీన పరచాలని కోరుతూ ఉయ్యూరు ఆర్.డి.ఓ శ్రీమతి వై.ఎస్. కరుణ కుమారి, ఉయ్యూరు తహశీల్దార్ ఎం. సురేష్ కుమార్ లకు ఆర్టీఐ కార్యకర్తలు జంపాన శ్రీనివాస గౌడ్, బేతపూడి జోగేశ్వరరావులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

## విమానాశ్రయ విస్తరణ నిర్వాసితులకు అండగా డా. వల్లభనేని వంశీ



గన్నవరం శ్రీ వార్త న్యూస్:విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, తగిన ప్యాకేజీ అందించాలని కోరుతూ గన్నవరం మాజీ ఎమ్మెల్యే డా. వల్లభనేని వంశీ మోహన్ బాధితులకు అండగా నిలిచారు.భూములు కోల్పోయిన నిర్వాసితుల ఆవేదనను అర్థం చేసుకున్న డా. వంశీ, వారి హక్కుల సాధనలో తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు.నిర్వాసితులకు తగిన పునరావాస ప్యాకేజీ, మెరుగైన పరిహారం అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా నిర్వాసితులు తెలిపారు.

## నందిగామ మున్సిపల్ కూటమి అభ్యర్థిగా మండవ పిచ్చయ్య...!



నందిగామ, అక్టోబర్ 12, శ్రీవార్త: నందిగామ మున్సిపల్ చైర్మన్ ఓసీ జనరల్ కావడంతో చైర్మన్ రేస్ లో పలువురు సంఖ్య పెరుగుతుంది. ముఖ్యంగా ప్రజా ఆదరణ కలిగిన నాయకుడు మండవ పిచ్చయ్య అయితే బాగుంటుందని పట్టణ ప్రజల భావిస్తున్నారు. గతంలో వారి సతీమణి మండవ వరలక్ష్మి మున్సిపల్ చైర్మన్ గా సేవలందించారు. నందిగామ పట్టణ అభివృద్ధికి ఎంతగానో మండల దంపతులు కృషి చేశారు. దివంగత వరలక్ష్మి ఆకస్మిక మరణం అనంతరం వారి కుటుంబ సభ్యులు మరదలు కృష్ణకుమారి చైర్మన్ పదవి నిర్వహించారు. అనుభవశాలి, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి, అందరివాడైన మండవ పిచ్చయ్య చైర్మన్ అభ్యర్థి అయితే బాగుంటుందని పట్టణ ప్రజలు ముక్తకంఠంగా కోరుతున్నారు.

## పరమ శివుని ఆకలి తీర్చిన అన్నపూర్ణేశ్వరి





(ఎస్ ఎస్ ఆర్ ఆంజనేయులు)

ఆంధ్రప్రదేశ్ శ్రీ వార్త ప్రతినిధి అన్నపూర్ణేశ్వరి పార్వతీ దేవి యొక్క అవతారం. మనకు ఆహారాన్ని పూర్తిగా అందించే తల్లి అని అర్థము. అమ్మవారు ఎరుపురంగు వస్త్రాలు ధరించి, మూడు కళ్ళు, నాలుగు చేతులతో ఒక చేతిలో కుండ, మరో చేతిలో గరిటె పట్టుకొని సింహాసనంపై కూర్చొని వుంటారు. వారణాసి (కాశీ) లోని ప్రసిద్ధ అన్నపూర్ణా దేవి మందిరం, కర్ణాటకలోని తుంగభద్ర నది ఒడ్డున ఆగస్త్యమహర్షి స్థాపించిన హోరనాడు అన్నపూర్ణేశ్వరి ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందినవి.అక్షయ తృతీయ రోజున అమ్మవారు



జన్మించిందని నమ్ముతారు. పౌరాణిక కథ :ఒకసారి సృష్టిలో సమస్తం (ఆహారంతో సహా) మాయ అని, శివుడు అనడంతో, ప్రకృతిలో ఆహారం కరువై జీవులన్నీ ఇబ్బందులు పడతాయి. అప్పుడు పార్వతీదేవి అన్నపూర్ణేశ్వరిగా ప్రత్యక్షమై అన్నదానం చేస్తుండగా, తన తప్పు తెలుసుకున్న పరమశివుడు బిక్షకునిగా ఆమె వద్దకు వచ్చి బిక్ష స్వీకరిస్తాడు.హిందూ సంప్రదాయంలో అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నదానం చేయడం గొప్ప పుణ్యకార్యంగా భావిస్తారు. అన్నదానం జరిగేచోట కాశీ అన్నపూర్ణేశ్వరి మహా శివునికి అన్నదానం చేస్తున్న చిత్రపటాలు ఉండటం విశేషం.

## జి.ఓ. నం.45 అమలులో జాప్యంపై ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ ఫోరం ఆందోళన



--- తక్షణమే అమలు చేయాలని డిమాండ్

అమలు చేసేవరకు ఆందోళన ఉదృతంగా నిర్వహిస్తాం....

విజయవాడ, అక్టోబర్ 12, శ్రీవార్త న్యూస్:: ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ ఫోరం కార్యవర్గ సమావేశం సోమవారం విజయవాడలోనిబందర్ రోడ్డులో గల ఒక హోటల్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశంలో విద్యుత్ సంస్థల్లో జి.ఓ. నం.45 అమలు పరిస్థితిని సమీక్షించి, ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంపు ఉత్తర్వుల అమలులో జరుగుతున్న జాప్యంపై కార్యవర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నం.45ను అమలు చేయకుండా కాలయాపన చేయడం ఉద్యోగుల ప్రయోజనాలకు విరుద్ధమని, ఇప్పటికే పదవీ విరమణ వయస్సు పెంపు అమలులో ఉన్న ఇతర ప్రభుత్వ విభాగాలు, సంస్థల ఉద్యోగులతో సమానంగా విద్యుత్ సంస్థల ఉద్యోగులకు కూడా న్యాయం జరగాలని ఫోరం స్పష్టం చేసింది.ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన అంశాన్ని పక్కనపెట్టి, ఇంకా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కావాల్సిన ఇతర అంశాలనే ప్రధాన అజెండాగా తీసుకుంటూ జి.ఓ.45 అమలును విస్మరించడం పట్ల జేఏసీ నాయకుల వైఖరిని కార్యవర్గం ఆక్షేపించింది. మెజారిటీ ఉద్యోగుల అభిప్రాయాలు, ఆవేదనలను పరిగణనలోకి తీసుకోకుండా వారి ప్రధాన సమస్యను జేఏసీ అజెండాలో ప్రాధాన్యతగా చేర్చకపోవడం విచారకరమని పేర్కొంది.ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్పునకు ఫోరం వ్యతిరేకం కాదు. ఆ అంశంపై కూడా ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వంతో చర్చలు జరిపి, అవసరమైన విధానపరమైన నిర్ణయాలు, ఉత్తర్వులు సాధించాల్సి ఉంటుంది. అయితే, ఆ అంశానికి సంబంధించిన ఉత్తర్వులు ఇంకా రావాల్సి ఉండగా, ఇప్పటికే జారీ అయిన జి.ఓ.45 అమలును ఎందుకు నిర్లక్ష్యం చేయాలి? ఒక సమస్యపై పోరాటం చేస్తూనే, మరో సమస్యపై ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు కృషి చేయవచ్చని ఫోరం అభిప్రాయపడింది.ఒకసారి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులే అమలు కాకపోతే, భవిష్యత్తులో ఉద్యోగులకు సంబంధించిన ఇతర ప్రభుత్వ ఉత్తర్వుల అమలుపై నమ్మకం ఎలా కలుగుతుందని కార్యవర్గం ప్రశ్నించింది. ప్రభుత్వ ఉత్తర్వులను సంస్థల యాజమాన్యాలు తమ ఇష్టానుసారం వాయిదా వేస్తే, భవిష్యత్తులో ఉద్యోగుల హక్కులు, సర్వీసు నిబంధనలు, పెన్షన్ ప్రయోజనాల పరిస్థితి ఏమిటన్నది ప్రతి ఉద్యోగి ఆలోచించాల్సిన విషయమని పేర్కొంది.జి.ఓ.45 అమలులో జాప్యం కారణంగా ప్రతి నెలా అనేకమంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. మరికొందరు పదోన్నతులు పొందినప్పటికీ, అమలులో ఉన్న అనిశ్చితి కారణంగా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పదవీ విరమణ పొందినవారు, పదవీ విరమణకు చేరువలో ఉన్నవారు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న మానసిక వేదన బాధాకరమని ఫోరం పేర్కొంది. ప్రతి నెలా ఆలస్యం కావడం వల్ల ఉద్యోగులకు కలిగే నష్టాన్ని ఇకపై నిర్లక్ష్యం చేయరాదని కోరింది.ఈ నేపథ్యంలో, గౌరవనీయులైన ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విద్యుత్ సంస్థల యాజమాన్యాలు జి.ఓ. నం.45ను తక్షణమే అమలు చేసి, అర్హులైన ఉద్యోగులకు 62 సంవత్సరాల పదవీ విరమణ వయస్సు ప్రయోజనాన్ని కల్పించాలి అని కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగుల విషయంలో కూడా న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని కోరింది.అదేవిధంగా, జేఏసీ నాయకులు, వివిధ కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగుల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకు రావాలని ఫోరం విజ్ఞప్తి చేసింది. జి.ఓ.45 అమలుకు అనేక సంఘాలు ఇప్పటికే తమ స్థాయిలో మద్దతు తెలిపినప్పటికీ, ఆ అంశాన్ని జేఏసీ ఉమ్మడి అజెండాలో ప్రాధాన్యతగా తీసుకురాకపోవడం పట్ల కార్యవర్గం విచారం వ్యక్తం చేసింది.ఉద్యోగుల ప్రయోజనాల కోసం సంఘాలు, యూనియన్లు ఏర్పడినప్పుడు, ఉద్యోగులకు ప్రభుత్వం ఇప్పటికే కల్పించిన హక్కుల అమలే ప్రథమ ప్రాధాన్యత కావాలి. ఇతర అంశాలపై పోరాటాలు కొనసాగిస్తూనే, జి.ఓ.45 అమలుకు సమష్టిగా కృషి చేయాలని ఫోరం కోరింది.ఇప్పుడే సాధించాలి --- లేకపోతే ఎప్పటికీ కోల్పోయే ప్రమాదం ఉంది" అనే వాస్తవాన్ని ప్రతి ఉద్యోగి, ప్రతి సంఘ నాయకుడు గుర్తించాలని ఫోరం పిలుపునిచ్చింది. అన్ని సంఘాలు ఐక్యంగా ముందుకు వచ్చి, విద్యుత్ రంగ ఉద్యోగులకు న్యాయం జరిగేలా జి.ఓ.45 అమలును తక్షణమే సాధించాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ ఫోరం కార్యవర్గం విజ్ఞప్తి చేసింది.రామకృష్ణుడు గుత్తావిల్లిఅధ్యక్షుడుకోటేశ్వరరావు ఎస్ జనరల్ సెక్రెటరీశ్రీ ను వాసు రా వు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, రాజశేఖర్, శ్రీనివాసరావు, రత్నకుమార్ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ ఫోరం

## జనసేన ఎన్నికల సమన్వయకర్తగా పూజారి రాజేష్



నందిగామ, అక్టోబర్ 12, శ్రీవార్త న్యూస్: జనసేన నందిగామ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో సమన్వయకర్తగా నాకు బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు" కొణిదెల పవన్ కళ్యాణ్ గకి పూజారి రాజేష్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ కు పలువురు అభినందనలు తెలిపారు.

# మన ఆహారమే మన ఆరోగ్యం



మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం మీద, పాటించే అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి, ఆహారాన్ని ఆకలి తీర్చుకోవటానికి, కడుపు నింపుకోవటానికి మాత్రమే కాదు– ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని తీసుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినాలి. ఆరోగ్యంగా ఉంటేనే అన్నీ బాగుంటాయి. ఆరోగ్యకరమైన జీవితం కోసం పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. సరైన ఆహారం అంటే ఆరు రుచులున్న ఆహారం. అంటే దాంట్లో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, ఒగరు ఉండాలి. మనం తినే సహజమైన ఆహారంలో పచ్చడి, కారం, పప్పు దినుసులు, రసం, మజ్జిగ, ఉండాలి. వాటి వల్ల శరీరంలో ప్రతి అవయవ వ్యవస్థలు ఆరోగ్యంగా ఉంటాయి. ఎలాగంటే సరైన సమయంలో సముపాళ్లలో తయారుచేసుకుని ప్రశాంతంగా కూర్చొని ఆహారం తినాలి. సరిపడా నీరు తాగాలి. రోజులో కనీసంగా ఆరేడు గంటలైనా నిద్రపోవాలి. స్నేహితులతో కలిసి మెలిసి ఆనందాన్ని, బాధను పంచుకోవాలి. పెద్దలను గౌరవించాలి. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది.

### పౌష్టికాహారం ముఖ్యం

పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు, తృణధాన్యాలు, నట్స్? వంటివి ఆహారంలో చేర్చుకుంటే ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు లభిస్తాయి. సీజనల్‌గా దొరికే పండ్లు, ఆకుకూరలు తప్పనిసరిగా ఎంతోకొంత మోతాదులో తినాలి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సకాలంలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలి. రాత్రి భోజనంలో తేలికగా జీర్ణమయ్యేలా సొరకాయ, బీరకాయ, దోసకాయ వంటి కూరగాయలతో చేసిన వంటకాలు తీసుకోవడం మంచిది. పన్నీర్, చిక్కుళ్ళు, బీన్స్, నానబెట్టిన బాదం వంటి వాటిలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. భోజనానికి అరగంట ముందు, ఆ తర్వాత గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, తీపి పానీయాలు, మసాలా పదార్థాలను తీసుకోవటం బాగా తగ్గించాలి. నానబెట్టిన బాదం, జీడిపప్పు, తేనెతో చేసిన క్యారెట్ జ్యూస్‌లు ఆరోగ్యానికి చాలా మంచివి. అన్నం, నీళ్లు, పప్పు, కూర, పాలు, పెరుగు, చక్కర, బెల్లం..ఇలా మన దైనందిన ఆహారంలో భాగమయ్యేలా చూసుకోవాలి. మామిడిలో ఉన్నట్టే బొప్పాయిలోనూ విటమిన్?–ఏ ఉంటుంది. పైగా ఇది ఏడాదంతా దొరుకుతుంది. బాగా పాలిష్ పట్టిన తెల్ల బియ్యం కన్నా దంపుడు బియ్యం మంచివి. ఆకుకూరలు, మొలకెత్తిన ధాన్యాలు.. ఇవన్నీ మంచి పోషకాలనిచ్చేవే. నూనెల నుంచి వచ్చే పోషకాలు, శక్తి–క్యాలరీలు కూడా మన శరీరానికి అవసరం. తినే ఆహారంలో మనకు లభించే క్యాలరీల్లో కనీసం 20 శాతం నూనెల నుంచి రావటం ఎంతైనా అవసరం. నూనెల నుంచి శరీరానికి అత్యవసరమైన కొవ్వు ఆమ్లాలు (ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్) కొన్ని లభిస్తాయి. శరీరంలో కొన్ని జీవక్రియలు సజావుగా జరగాలంటే కొవ్వు తప్పనిసరి. ఎ, బి, ఇ, కె విటమిన్లు కేవలం కొవ్వులో మాత్రమే కరుగుతాయి. శరీరానికి అన్ని పోషకాలూ అవసరం, కానీ వాటిని మితంగా, సమతులంగా తీసుకోవటం మంచిది. ఆపిల్ తొక్కలోనే పోషకాలు ఎక్కువ. లోపల ఉండేదంతా వట్టి పిండి పదార్థమే. పిండిపదార్థం మనం తినే వరి అన్నం వంటి వాటి నుంచి దండిగానే లభిస్తుంది.

### జీర్ణక్రియ మెరుగుదలకు నీరు దోహదం

మన శరీరానికి నీటి అవసరం కేవలం మనం తాగే నీటి రూపంలోనే కాదు; పండ్లు, కూరగాయలు, అన్నం, చారు, మజ్జిగ.. ఇలా అన్నింటి ద్వారా తీరుతుంది. ఇవికాక రోజు మొత్తమ్మీద 2 నుంచి 2.5 లీటర్ల నీరు తాగితే చాలు. అంతకంటే ఎక్కువ తాగితే శరీరంలోని స్రావాలన్నీ పల్చబడిపోయి వాటి పనిసామర్థ్యం బాగా తగ్గిపోతుంది. ఇలా ఎక్కువగా తాగటం వల్ల జీర్ణ ప్రక్రియ వెనకబడుతుంది. ఒక్కసారే నీళ్లు ఎక్కువగా తాగేస్తే ఎంజైములు వంటివి అన్నీ పల్చబడి, వాటి సామర్థ్యం తగ్గిపోతుంది. ఆహారం తినేటప్పుడు మధ్య మధ్యలో కాకుండా మొత్తం తినటం పూర్తయిన తర్వాత తాగాలి. ఒక్కసారే ఎక్కువగా తాగటం కాకుండా రోజంతా వివిధ సందర్భాల్లో తాగుతుండటం ముఖ్యం.

### ఎండల నుంచి ఉపశమనం ఇలా...

ఎండాకాలంలో మన శరీరం ఎక్కువగా నీరసం, అలసట, డీహైడ్రేషన్ వంటి సమస్యలకు గురవుతుంది. అధిక ఉష్ణోగ్రతలతో శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత కలగడం సాధారణమే. అందుకే ఈ కాలంలో సరైన ఆహారం తీసుకుంటే శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు.

### డీహైడ్రేషన్ లేకుండా చేసే పండ్లు

పుచ్చకాయ, ఖర్బూజ, మామిడి, ద్రాక్ష వంటి పండ్లు శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా, నీటి లోపాన్ని భర్తీ చేస్తాయి. ముఖ్యంగా పుచ్చకాయలో 90 శాతం పైగా నీరు ఉంటుంది. ఇది డీహైడ్రేషన్‌ను నివారించడంలో ఎంతో సహాయపడుతుంది. ఈ పండ్లు శరీరాన్ని చల్లబరుస్తూ, జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుస్తాయి. రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవడం చాలా మంచిది. ఈకాలంలో దొరికే మామిడి కాయలు, పండ్లు తినడం ద్వారా శరీరానికి అదనపు శక్తి వస్తుంది.

### ప్రోబయోటిక్స్‌తో జీర్ణక్రియ మెరుగుదల

ఎండాకాలంలో పెరుగు తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇది శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతుంది. మధ్యాహ్న భోజనంతో పాటు ఒక గ్లాస్ మజ్జిగ తీసుకోవడం వల్ల వేడి ప్రభావం తగ్గుతుంది.

### ఎనర్జీ డ్రింక్ కొబ్బరినీళ్లు

కొబ్బరి నీళ్లు సహజమైన ఎనర్జీ డ్రింక్. కొబ్బరి నీటిలో పొటాషియం, సోడియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్‌ను అందిస్తాయి. ఇవి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రోజుకు ఒకసారి కొబ్బరి నీరు తాగడం వల్ల అలసట తగ్గి, శరీరం తాజాగా ఉంటుంది.

### శరీరాన్ని చల్లబర్చే కీరదోస, ఆకుకూరలు

కీరదోసలో నీటిశాతం ఎక్కువగా ఉండటంతో పాటు, తక్కువ కేలరీలు ఉంటాయి. ఇది శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడుతుంది. ఆకుకూరలు కూడా విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉండటం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని సలాడ్ రూపంలో తీసుకోవడం ఉత్తమం. ఇవి తేలికగా జీర్ణమవుతూ, పోషకాలను అందిస్తుంది.

### ఎలక్ట్రోలైట్ డ్రింక్‌గా నిమ్మరసం

ఎండాకాలంలో నిమ్మరసం తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం వస్తుంది. ఇందులో విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నిమ్మరసం, చిటికెడు ఉప్పు, చక్కెర కలిపి తాగితే ఇది ఉత్తమ సహజ ఎలక్ట్రోలైట్ డ్రింక్‌గా పనిచేస్తుంది. డీహైడ్రేషన్‌ను నివారించడానికి దోహదపడుతుంది.

# లాభాలు ఎలా రాబట్టుకుంటారో ఏమో!

గడిచిన రెండేళ్లుగా ప్రపంచ పారిశ్రామిక, సాంకేతిక రంగాలను సునామీలా చుట్టుముట్టేసిన పదం 'కృత్రిమ మేధ' (ఏఐ). డేటా సెంటర్లు, అధునాతన చిప్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) అభివృద్ధి కోసం కంపెనీలు బిలియన్ల కొద్దీ డాలర్లను వరదలా పారించాయి. అయితే, ఈ ఏఐ విప్లవం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. గతంలో ఉత్సాహంగా పెట్టిన పెట్టుబడులపై ఇన్వెస్టర్లు, కంపెనీల యాజమాన్యాలు ఆలోచనలో పడ్డాయి. అసలు ఇంతటి భారీ పెట్టుబడులకు తగిన ప్రతిఫలం లభిస్తుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రపంచ మార్కెట్లను వేధిస్తున్నాయి.

### పెరుగుతున్న ఉత్కంఠ

ఏఐ రంగంలో మైలురాయిగా భావించే మైక్రోసాఫ్ట్–ఓపెన్‌ఏఐ భాగస్వామ్యం ఇప్పుడు అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటోంది. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీసెర్చ్ కలయికగా మొదలైన ఈ బంధం వ్యయ నియంత్రణ వద్దకు వచ్చేసరికి అనిశ్చితి ఎదుర్కొంటోంది. అత్యున్నత స్థాయి ఏఐ వ్యవస్థలను నిర్మించడానికి, శిక్షణ ఇవ్వడానికి అయ్యే ఖర్చు అసాధారణంగా ఉంటోంది. ఒకే మోడల్‌ను ఒక్కసారి ట్రైన్ చేయడానికి వందల మిలియన్ల డాలర్లు ఖర్చవుతుండగా రోజువారీ మిలియన్ల కొద్దీ యూజర్ల ప్రశ్నలకు సమాధానమివ్వడం కంపెనీలకు సవాలుగా మారుతుంది. టెక్ దిగ్గజాల వద్ద నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ఈ వ్యయం దీర్ఘకాలంలో భారంగా మారుతుందన్న ఆందోళన మొదలైంది.



### మౌలిక సదుపాయాలు..

ఏఐ రంగంలో మౌలిక సదుపాయాల కల్పన ఒక పెద్ద చిక్కుముడిగా మారింది. ఎన్విడియా, ఏఎండీ వంటి కంపెనీలు ఏటా మరింత శక్తివంతమైన చిప్స్‌ను విడుదల చేస్తున్నాయి. ఇది సాంకేతిక పురోగతికి శుభసూచకమే అయినా, పెట్టుబడి కోణంలో ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోంది. రెండేళ్ల క్రితం వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన డేటా సెంటర్లు నేటి ఏఐ అవసరాలకు (విద్యుత్, కూలింగ్ వ్యవస్థ) సరిపోవడం లేదు. మౌలిక సదుపాయాలు అనేవి దీర్ఘకాలిక ఆస్తులు. కానీ ఏఐ హార్డ్‌వేర్ సాఫ్ట్‌వేర్ వేగంతో మారిపోతోంది. దీనివల్ల భారీ పెట్టుబడులు పెట్టిన ఆస్తులు త్వరగా వాడుకలో లేకుండా పోతున్నాయి.

### స్కేలింగ్ లాస్ ఎం ఎకనామిక్ లాస్

ఏఐ అభివృద్ధిలో ఒక ప్రాథమిక సూత్రం ఉంది. అది 'ఎక్కువ డేటా ం ఎక్కువ గణన సామర్థ్యం = మెరుగైన ఫలితం'. దీనినే స్కేలింగ్ లాస్ అంటారు. కానీ, ఇప్పుడు ఆర్థిక పరిమితులు ఈ సూత్రాన్ని అడ్డుకుంటున్నాయి. నమూనాలు పెద్దవి అయ్యే కొద్దీ, వాటి పనితీరులో వచ్చే మెరుగుదల తగ్గుతూ ఖర్చు మాత్రం విపరీతంగా పెరుగుతోంది. దీంతో కంపెనీలు మోడల్ కంప్రెషన్, ప్రత్యేక అప్లికేషన్లపై దృష్టి సారిస్తున్నాయి.

### పెట్టుబడిపై రాబడి ఎప్పుడు?

సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ రంగంలో ఒకసారి ప్రోగ్రామ్ రాస్తే ఎంతమంది వాడుకున్నా అదనపు ఖర్చు నామమాత్రంగానే ఉంటుంది. కానీ ఏఐ అలా కాదు. ప్రతి సెర్చ్, ప్రతి ఇంటరాక్షన్ వెనుక భారీ ఖర్చు ఉంటుంది. దీనిని మానిటైజ్ చేయడం (డబ్బుగా మార్చుకోవడం) ఇంకా ఒక సవాలుగానే ఉంది. సంస్థలకు ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలు దీర్ఘకాలికంగా కనిపిస్తుండగా ఖర్చులు మాత్రం తక్షణమే చెల్లించాల్సి వస్తోంది.

### ఆగిపోని విప్లవం

ఏఐ విప్లవం ఆగిపోతుందని దీని అర్థం కాదు. కానీ, ఇది 'అపరిమిత అవకాశాల' దశ నుంచి 'పరిమిత ఆప్టిమైజేషన్' దశకు చేరుకుంటుంది. పెట్టుబడిదారులు ఇప్పుడు కేవలం సాంకేతిక సామర్థ్యాన్ని మాత్రమే చూడటం లేదు, లాభదాయకత కూడా లెక్కిస్తున్నారు.




# ఏఐ వినియోగంలో భారత్ టాప్.. కానీ..



**కొన్ని నగరాలకే పరిమితమైన టెక్నాలజీ**
**గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగం తక్కువే**
**ఓపెన్‌ఏఐ నివేదికలో వెల్లడి**

న్యూఢిల్లీ: కోడింగ్, డేటా అనాలిసిస్, సంక్లిష్టమైన రీజనింగ్‌లాంటి అంశాల్లో భారత్ ప్రపంచంలోనే అధునాతన ఏఐ మార్కెట్లలో ఒకటిగా ఉంటోందని ఓపెన్ ఏఐ ఒక నివేదికలో తెలిపింది. సంక్లిష్టమైన సవాళ్లను పరిష్కరించేందుకు, అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఏఐని తరచుగా యూజర్లు వినియోగించుకోవడంలో టాప్ అయిదు దేశాల్లో భారత్ ఒకటిగా ఉంటోందని పేర్కొంది. అయితే, కృత్రిమ మేధ వినియోగం కొన్ని నగరాలకే పరిమితమవుతోందని, గ్రామీణ.. పట్టణ ప్రాంతాల్లో చాలా తక్కువగా ఉంటోందని వివరించింది. సాటి దేశాలతో పోల్చి చూసినప్పుడు, భారత్‌లో మిగతా ప్రాంతాల కన్నా టాప్ నగరాల్లో ఏఐ వినియోగం 3 రెట్లు అధికంగా ఉంటోందని ఓపెన్‌ఏఐ తెలిపింది. రిపోర్ట్ ప్రకారం కోడింగ్, డేటా అనలిటిక్స్ వినియోగంలో కూడా భారత్‌కి పటిష్టమైన ర్యాంకింగ్ ఉంది. 2026 ఫిబ్రవరిలో ఓపెన్‌ఏఐ కోడెక్స్ (కోడింగ్ టూల్) యాప్‌ను ఆవిష్కరించిన రెండు వారాల్లోనే దీని యూజర్ల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. అయితే, ఈ వినియోగం అన్ని ప్రాంతాల్లోనూ సమానంగా, ఒకే రకంగా లేదు. అడ్వాన్స్‌డ్ ఏఐ వినియోగంలో భారీగా అంతరాలు ఉంటున్నాయి.

### మరిన్ని విశేషాలు..

మొత్తం ఏఐ యూజర్లలో 50 శాతం మంది టాప్ 10 నగరాల్లో ఉంటున్నారు, ఢిల్లీ ఎన్‌సీఆర్ అగ్రస్థానంలో ఉంది. అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, జర్మనీలాంటి సాటి దేశాలతో పోలిస్తే దేశీయంగా టాప్ నగరాల్లో ఏఐ వినియోగం 3 రెట్లు ఎక్కువగా ఉంటోంది. దేశ జనాభాలో ఈ నగరాల్లో నివసించే వారి సంఖ్య 10 శాతం లోపే ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఏఐ వినియోగం విషయానికొస్తే అంతరం మరింత ఎక్కువగా ఉంటోంది. వెనుకబడిన నగరాలతో పోలిస్తే టాప్ సిటీల్లో డేటా అనాలిసిస్ వినియోగం 30 రెట్ల వరకు, కోడింగ్ వినియోగం 4 రెట్లు, ఏఐ డెవలపర్ (కోడెక్స్) వినియోగం 9 రెట్లు అధికంగా ఉంది. పోటీ దేశాలతో పోలిస్తే భారత్‌కి ఏఐ సామర్థ్యాలు గణనీయంగా ఉన్నప్పటికీ, హైదరాబాద్, బెంగళూరు,, ఢిల్లీ, చెన్నైలాంటి కొన్ని పట్టణ ప్రాంత హబ్‌లలో మాత్రమే అవి కేంద్రీకృతమై ఉంటున్నాయి. విద్య, ఆరోగ్యంలాంటి రంగాల్లో అత్యంత అర్థవంతమైన విధంగా ఏఐ వినియోగం పెరుగుతోంది. విద్య విషయంలో తూర్పు రాష్ట్రాలు ముందుంటున్నాయి. విద్యాభ్యాసానికి సంబంధించిన మొత్తం మెసేజీలు జాతీయ సగటైన 20 శాతానికి మించి అస్సాంలో 22 శాతం స్థాయిలో ఉంటున్నాయి. ఒరిస్సా, మణిపూర్, త్రిపుర, చత్తీస్‌గఢ్‌లలో కూడా దాదాపు ఇదే ధోరణి ఉంది. ఆరోగ్యం విషయంలో జమ్మూ కాశ?మర్, పంజాబ్, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్, కేరళలాంటి ప్రాంతాల్లో ఏఐ వినియోగం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. జమ్మూ కాశ్మీర్‌లో ప్రతి 10 మెసేజీల్లో ఒకటి ఆరోగ్యానికి సంబంధించినది ఉంటోంది. జాతీయ సగటుతో పోలిస్తే ఇది 32 శాతం అధికం. టెక్నాలజీ వినియోగ సామర్థ్యాలు ఎంత విస్తృతంగా అందరికీ అందుబాటులోకి వచ్చాయనే దానిపై భారతదేశపు తదుపరి దశ ఏఐ ప్రస్థానం ఆధారపడి ఉంటుంది. తొలినాటి వినియోగదారుల పరిధిని దాటి ఏఐ ప్రయోజనాలు ఎంత వేగంగా మరింత భారీ స్థాయిలో జనాభాకు అందుబాటులోకి వస్తాయనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ అంతరాలను భర్తీ చేయాలంటే నైపుణ్యాలను పెంపొందించడం, అర్థవంతమైన విధంగా ఉపయోగించుకునేందుకు తోడ్పాటు అందించడం కీలకంగా ఉండనున్నాయి.

# మాక్ యూజర్ల కోసం పెర్ప్లెక్సిటీ 'పర్సనల్ కంప్యూటర్'

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా దూసుకుపోతున్న 'పెర్ప్లెక్సిటీ' టెక్ ప్రపంచంలో మరో సంచలనానికి తెరలేపింది. మాక్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా 'పర్సనల్ కంప్యూటర్' అనే సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను కంపెనీ అధికారికంగా ప్రారంభించింది. ఇది కంప్యూటర్‌లోని ఫైళ్లు, అప్లికేషన్లతో నేరుగా ఇంటరాక్ట్ అయ్యే ఒక ఏఐ ఏజెంట్ అని కంపెనీ తెలిపింది.

### మల్టీ-మోడల్ ఆర్కెస్ట్రేషన్

ఫిబ్రవరిలో కంపెనీ పరిచయం చేసిన 'పెర్ప్లెక్సిటీ కంప్యూటర్' అధునాతన ఆర్కెస్ట్రేషన్ ఫీచర్లను ఇప్పుడు నేరుగా యూజర్ల పర్సనల్ కంప్యూటర్లలో తీసుకువచ్చారు. దీని ప్రత్యేకత ఏమిటంటే.. ఇది కంప్యూటర్‌లోని లోకల్ ఫైల్స్, ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లు, వెబ్ కంటెంట్‌ను ఒకే చోట అనుసంధానిస్తుంది. సంక్లిష్టమైన పనులను పూర్తి చేయడానికి ఈ సాఫ్ట్‌వేర్ ఏకకాలంలో మల్టీ ఏఐ ఏజెంట్లను రంగంలోకి దించుతుంది.

### మాక్ మినీతో నిరంతర సేవలు

ఈ సాఫ్ట్‌వేర్ అత్యంత ఆకర్షణీయమైన అంశం దాని 'రిమోట్ యాక్సెస్' సామర్థ్యం. ఒకవేళ మీరు మాక్ మినీలో ఈ సాఫ్ట్‌వేర్‌ను రన్ చేస్తుంటే అది 24/7 అందుబాటులో ఉంటుంది. మీరు ఇంటి బయట ఉన్నప్పుడు కూడా మీ స్మార్ట్‌ఫోన్ ద్వారా వాయిస్ కమాండ్స్ ఇచ్చి మీ కంప్యూటర్‌లోని పనులను పూర్తి చేయవచ్చు లేదా పర్యవేక్షించవచ్చు.

### పర్సనల్ కంప్యూటర్ చేసే పనులు ఇవే..

ఈ ఏఐ అసిస్టెంట్ కేవలం సమాధానాలు చెప్పడమే కాకుండా క్రియేటివ్ పనులను కూడా చక్కబెడుతుంది.

మీ 'టూ–డూ లిస్ట్' సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తుంది. యాపిల్ నోట్స్ లేదా మెసేజెస్ వంటి యాప్‌లను తెరిచి మీకు కావాల్సిన సమాచారాన్ని పంపడం లేదా నోట్స్ సిద్ధం చేయడం వంటివి చేస్తుంది. అస్తవ్యస్తంగా ఉన్న ఫోల్డర్‌లను క్రమబద్ధీకరించడం, ఫైళ్లకు అర్థవంతమైన పేర్లు పెట్టడం వంటి పనులను క్షణాల్లో పూర్తి చేస్తుంది.మొబైల్ నుంచే వాయిస్ ద్వారా పనులను పూర్తి చేసే వెసులుబాటు ఉంది.




### భద్రతే ప్రాధాన్యం

వినియోగదారుల డేటా భద్రత విషయంలో పెర్ప్లెక్సిటీ కఠినమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పారు. 'పర్సనల్ కంప్యూటర్ అప్లికేషన్ అత్యంత సురక్షితమైన 'శాండ్‌బాక్స్' వాతావరణంలో పనిచేస్తుంది. ఇది చేసే ప్రతి చర్యను యూజర్లు పర్యవేక్షించవచ్చు. ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే మార్పులు చేసే సదుపాయం కూడా ఉంది' అని కంపెనీ స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఈ 'పర్సనల్ కంప్యూటర్' ఫీచర్ పెర్ప్లెక్సిటీ ప్రో చందాదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. వెయిట్‌లిస్ట్‌లో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ త్వరలోనే సాధారణ వినియోగదారులందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది.

# 2 వారాల పాటు ఈ గింజలను తినండి.. శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయి..

చిన్నగా కనిపించే ఒక సూపర్ ఫుడ్ శరీరంలో కేవలం రెండు వారాల్లో మార్పులు తీసుకురాగలదా? అవును, అది చియా గింజల వల్ల సాధ్యమే. పోషక విలువలతో నిండిన ఈ గింజల్లో ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. పరిమాణంలో చిన్నవైనా, ప్రతిరోజూ తీసుకుంటే ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపిస్తాయి. నిపుణుల ప్రకారం, రోజూ ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను 14 రోజుల పాటు తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా శక్తి స్థాయిలు పెరగడం, హృదయ ఆరోగ్యం మెరుగుపడడం వంటి ప్రయోజనాలు పొందవచ్చు. వీటిలో ఉన్న అధిక ఫైబర్ గట్ (జీర్ణ వ్యవస్థ)లో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడుతుంది. అలాగే నీటిని ఎక్కువగా శోషించుకునే గుణం ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి లేకుండా ఉంచి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది.



### జీర్ణక్రియ మెరుగుపడేందుకు..

అలాగే జీర్ణక్రియ మెరుగుదల విషయంలో చియా గింజలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇవి ద్రవ్యంలో కరిగే ఫైబర్‌ను అధికంగా కలిగి ఉండటం వల్ల నీటిని పీల్చుకుని జెల్ రూపంలో మారుతాయి. దీంతో మలబద్ధకం తగ్గి, క్రమబద్ధమైన విసర్జనకు సహాయపడుతుంది. అంతేకాకుండా, గట్‌లోని మంచి బ్యాక్టీరియాకు పోషణను అందించి జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. అదేవిధంగా హృదయ ఆరోగ్యానికి కూడా చియా గింజలు మేలు చేస్తాయి. వీటిలో ఉన్న ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ద్రవ్యంలో కరిగే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది.

### షుగర్ లెవల్స్ తగ్గేందుకు..

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా ఇవి కీలకంగా పనిచేస్తాయి. చియా గింజలలోని ద్రవ్యంలో కరిగే ఫైబర్ జీర్ణక్రియను నెమ్మది చేస్తుంది. దీంతో కార్బోహైడ్రేట్ల శోషణ ఆలస్యమై, భోజనం తర్వాత రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరగకుండా అడ్డుకుంటుంది. ఇక చియా గింజలను రాత్రంతా నానబెట్టి ఉదయం తీసుకోవడం ఉత్తమం. రోజుకు ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను నీరు లేదా పాలతో కలిపి తీసుకుంటే, వాటి పూర్తి పోషక ప్రయోజనాలను పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

## పేర్ని నానికి ఓటమి భయం వెంటాడుతోంది.... టీడీపీ నాయకులు



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:పేర్ని నాని, వైసిపి నాయకులను ఓటమి భయం వెంటాడుతూనే ఉందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారుమచిలీపట్నం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు క్లస్టర్ ఇన్చార్జి లు తలారి సోమశేఖర్, లంకే శేషగిరి, తదితర నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ, మచిలీపట్నం నియోజకవర్గంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 9 గ్రామ పంచాయతీలకు గత పదేళ్లుగా ఎన్నికలు జరగకుండా వైసిపి నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు.మచిలీపట్నం నియోజకవర్గంలోని సుల్తాన్ నగర్, అరిసేపల్లి, ఎస్ ఎన్ గొల్లపాలెం, రుద్రవరం, పెద్ద కరగ్రహారం, చిన్న కరగ్రహారం,గరాల దెబ్బ ,మేకవానిపాలెం ,పోతేపల్లి గ్రామపంచాయతీలను మచిలీపట్నం మున్సిపాలిటీలో విలీనం చేస్తామని చెప్పి మాజీమంత్రి పేర్ని నాని ఈ పంచాయతీలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు.ఈ తొమ్మిది గ్రామ పంచాయతీలను అటు మున్సిపాలిటీలోనూ విలీనం చేయకుండా ఇటు పంచాయతీ ఎన్నికలు జరగకుండా రెండు పర్యాయాలుగా పేర్ని నాని అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు.ఫలితంగా ఆయా గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు.ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు ఆ పంచాయతీలకు అక్కరకు రాకుండా పోతున్నాయన్నారు.రెండు విడతలుగా విడుదలైన 15,16ఆర్థిక సంఘ నిధులు ఈ పంచాయతీలకు దక్కలేదన్నారు.ఆయా పంచాయతీలు కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నాయన్నారు.ఈ తొమ్మిది గ్రామ పంచాయతీలకు సర్పంచ్ లేకపోవడం వలన స్పెషలాఫీసర్ పాలన కొనసాగుతుందన్నారు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ప్రజలకు సరైన న్యాయం జరగక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు ప్రజల కనీస అవసరాలు తీరడం లేదన్నారు.ఆ తొమ్మిది గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహించి అభివృద్ధి చేయడానికి మంత్రి కొల్లు రవీంద్ర కృషి చేస్తుంటే వైసీపీ నాయకుల తో కోర్టులో కేసులు వేయించి ఆ పంచాయతీలకు ఎన్నికలు జరగకుండా మాజీ మంత్రి పేర్ని నాని అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు.ఇది ఏమాత్రం సమంజసం కాదని టిడిపి నాయకులు తెలిపారు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి గ్రామపంచాయతీలకు జరుగుతున్న అన్యాయాన్ని పరిగణలో తీసుకొని ఆ తొమ్మిది గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగడానికి సహకరించాలని కోరారు.ఓటమి భయంతో ఎన్నికలను అడ్డుకుంటే తాము చూస్తూ ఊరుకోమని ఈ సందర్భంగా హెచ్చరించారు.మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఓసారి మంత్రిగా చేసిన పేర్ని నాని తన కొడుకును ఎమ్మెల్యే చేయడం కోసం తాపత్రయ పడుతున్నాడని గ్రామాల్లో మాత్రం స్థానిక నాయకులు సర్పంచ్ ,ఎంపిటిసి ,జడ్పిటిసి ,ఎంపీపీ వంటి పదవులు పొందడం నానికి ఏమాత్రం ఇష్టం లేదన్నారు.అందుకే వైసిపి నాయకులతో కోర్టులో పిల్ కేసులు వేయించి ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు.మంత్రి రవీంద్ర ఆ గ్రామపంచాయతీలకు అండగా ఉంటారని మాజీ మంత్రి పేర్ని నాని పప్పులు ఉడకవని ఈ సందర్భంగా తెలిపారు."

## మచిలీపట్నం రైతు బజార్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందుతున్నాయా లేదా అనే అంశంపై మచిలీపట్నం రైతు బజార్ ను మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన రైతు బజార్ లోని ప్రతి స్టాల్ ను పరిశీలించారు. రైతులు తీసుకొస్తున్న కూరగాయల నాణ్యత, తూకం, ధరల పట్టిక, తాజాదనంపై ఆరా తీశారు.వినియోగదారులతో నేరుగా మాట్లాడి కూరగాయల ధరలు, నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతు బజార్ లో ధరలు బయట మార్కెట్ కంటే తక్కువగా ఉండాలని, తూకంలో మోసాలకు తావు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.కుళ్లిన, నిల్వ ఉంచిన కూరగాయలు విక్రయించకుండా రోజూ తాజా కూరగాయలు మాత్రమే విక్రయించాలని రైతులకు సూచించారు. రైతు బజార్ పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, వినియోగదారులకు తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన కూరగాయలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఎక్కడా రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో మార్కెట్ యార్డ్ సిబ్బంది, రైతులు,వినియోగదారులు పాల్గొన్నారు.

## భక్తులకు సౌకర్యవంతమైన దర్శనమే లక్ష్యం. సామాన్య భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు

భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు -- భద్రతకు పెద్దపీట

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

రాష్ట్ర దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్



విజయవాడ శ్రీ వార్త న్యూస్:అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శన అనుభవాన్ని అందించేందుకు దేవస్థానం, సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ సోమవారం ఇంద్రకీలాద్రి పై మీడియాతో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా అమ్మవారి దర్శనం కలిగించడంతోపాటు గౌరవ రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మూలా నక్షత్రం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతుందని అన్నారు.శరన్నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అమ్మవారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. వీఐపీ భక్తులతో పాటు సామాన్య భక్తులందరికీ ప్రాధాన్యతనిస్తూ, భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలు పర్యవేక్షిస్తున్నారన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లునవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారన్నారు.భక్తులు ఎక్కువసేపు ఇబ్బందులు పడకుండా దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.భద్రతకు ప్రాధాన్యత -- నిరంతర పర్యవేక్షణఉత్సవాల సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తగిన బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.భక్తులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంనవరాత్రి ఉత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం, భద్రతతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని అందించడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాట్లు చేపట్టామన్నారు.

## విజయవాడలో జాతీయ సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్, రాష్ట్రపతి పర్యటన,

ఏర్పాట్లను పరిశీలించిన ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టెక్నికల్ మురళీకృష్ణ యాదవ్





విజయవాడ శ్రీ వార్త న్యూస్:విజయవాడలోని పున్నమి ఘాట్లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్తో పాటు రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టిన విద్యుత్ సరఫరా ఏర్పాట్లను ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టెక్నికల్ శ్రీ అవుల మురళీకృష్ణ యాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఏర్పాట్లను సమీక్షించి, ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.అలాగే, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచుకుని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ పరిశీలనలో ఎన్టీఆర్ జిల్లా సూపరిడెంట్ ఇంజనీర్ యూ హనుమయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికిషోర్ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిత్రలేఖనం పోటీలో మచిలీపట్నం విద్యార్థిని ఆర్.లాస్యశ్రీప్రియ ప్రతిభ



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్:ది ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలో మచిలీపట్నానికి చెందిన విద్యార్థిని ఆర్.లాస్యశ్రీప్రియ ప్రతిభ చాటి బహుమతి దక్కించుకుంది.మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్లో ఆదివారం "ఫెస్టివల్ ఆఫ్ జాయ్ అండ్ కల్చర్" థీమ్ తో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు.ఈ పోటీలో ప్రతిభ కనబర్చిన లాస్యశ్రీప్రియను మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకులు బీఎంవీ రమేష్ తదితరులు అభినందించారు.

## మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా కన్కార్

లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటుకు ఎంపీ బాలశౌరి కృషి



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ డీప్ వాటర్ పోర్టుకు అనుబంధంగా ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి చేస్తున్నారు.జమ్మూ కాశ్మీర్ లో లోక్ సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ పర్యటనలో ఉన్న ఎంపీ బాలశౌరి, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్కార్ సీఎండీ అజిత్ కుమార్ పాండాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా గతంలో ఏపీ ప్రభుత్వం, మధ్య కుదిరిన యం ఓ యు ప్రకారం లాజిస్టిక్స్ జోన్ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం పోర్టు పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో కాన్కార్ కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు.దీనికి సీఎండీ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మచిలీపట్నం పోర్టును సందర్శించి ప్రాజెక్టు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గోవా షిప్ యార్డ్ ప్రాజెక్టుతో పాటు కన్కార్ జోన్ కార్యరూపం దాలిస్తే పోర్టు ఆధారిత పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించి, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణ ఎం.వి. రావు ఫౌండేషన్ లక్ష్యం.

చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ

విద్యార్థులకు సాక్స్, మహిళలకు గుడ్డ సంచులు పంపిణీ

(ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు )






మెట్టు,శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి నెల్లూరు జిల్లా కోట మండలం చెందోడుకు చెందిన విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, శ్రీమతి ఆదిలక్ష్మి పేరిట ఏర్పాటు అయిన ఎం. వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సంస్థ ఫౌండర్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమాజ సేవ, ప్రజలను చైతన్య పరచడం వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందారు. తాజాగా చిట్టమూరు మండలం మెట్టు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై ఒక సామాజిక కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నెల్లూరు జిల్లా కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన విద్యార్థులకు అవగాహన మరియూ పరిశుభ్రత పాటించే విషయంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాదరక్షలకు రక్షణగా సాక్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది.అలాగే మెట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగన్వాడీ కేంద్రం ఆవరణలో అంగన్వాడీ కేంద్రం టీచర్ పర్యవేక్షణలో ఎం. వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరుతూ గ్రామస్తులను చైతన్య పరిచారు. ప్లాస్టిక్ వినియోగం వద్దు అనే నినాదాలతో వారికి అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన మహిళలకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ గుడ్డ సంచుల ద్వారానే బజారుకు వెళ్లి వారి సరుకులు తెచ్చుకోవాలని ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ వారికి సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు మెట్టు గ్రామంలోని విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం. వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి శ్రీమతి ఎం. విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ విద్యార్థినీ విద్యార్థులు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## దేవస్థానాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం - మండలి వెంకట్రామ్ (రాజా)

-ఏకరాత్రి ప్రసన్న మల్లిఖార్జున స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



ఘంటసాల, శ్రీవార్త న్యూస్:దేవాలయాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. సోమవారం ఘంటసాల మండలం శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న శ్రీ ఏకరాత్రి ప్రసన్న మల్లిఖార్జున స్వామి వారి దేవస్థాన పునఃనిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీజీఎఫ్ నిధులు రూ.3 కోట్ల 75 లక్షలు (దాతల సహాయం మ్యాచింగ్ గ్రాంట్ రూ.కోటీ 25లక్షలు)తో దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి సహకారంతో ఎమ్మెల్యే ఈ దేవాలయ పునర్నిర్మాణం కోసం ప్రత్యేకంగా శ్రద్ధ వహించి నిధులు సమకూర్చినట్లు తెలిపారు. నిర్మాణం కానున్న నూతన దేవస్థానం భవ్య దివ్య మందిరంగా నిర్మాణం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన పార్టీ నాయకులు సుగ్గన పవన్ కుమార్, డీసీ వైస్ చైర్మన్ సుగ్గన రాంబాబు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు దాసం రామకృష్ణ, జనసేన నాయకులు కొండవీటి కృష్ణమూర్తి, కొండవీటి శ్రీనివాసరావు, కూటమి నేతలు తమ్మన సోమేశ్వరరావు, తమ్మన పవన్, గోపు రాఘవరాజు, శ్రీను, సత్యం, నాగేశ్వరరావు, మేకా పాములు, కొండవీటి కోటి, బాబురావు, పువ్వాడ సాంబయ్య, మేకా పుల్లయ్య, దేవస్థానం ఈఓ తోట చెన్నకేశవరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎం. వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

25మందికి కళ్లద్దాలు పంపిణీ చేసిన చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ.

(ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు)



వాకాడు శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి సర్వేంద్రియానామ్ నేత్రం ప్రధానం అంటారు. ప్రతి వ్యక్తికి ఎన్ని అవయవాలు లోపం ఉన్నప్పటికీ జీవనం సాగిస్తాడు. అయితే అందత్వం ఉంటే దీనిని చూడలేడు. అంధులను జీవన సరళిలో సుఖంగా వుండే విధంగా చూడాలని ఎం. వి. ఫౌండేషన్ ఆశయమని ఈ సంస్థ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ పేర్కొన్నారు. దేవీ నవరాత్రులు తొలిరోజు ఆదివారం వాకాడు,కోట మండలాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు.దృష్టిలోపం ఉన్న వారిని నేత్ర వైద్యులు



గుర్తించారు. వాకాడు కోట మండలాలలో 25 మందికిఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. వాసన్ ఐ కేర్ "మరియూ కోట రమేష్ "ఐ కేర్" ఆధ్వర్యంలో ఎం.వి. రావు ఫౌండేషన్ నిర్వాహకులు నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో అనేక మంది దృష్టిలోపం వున్నవారు హాజరైనారు. కంటి వైద్యులు కంప్యూటర్ పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం వున్నవారిని గుర్తించారు. ఎం. వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలమోహన్ కృష్ణ మాట్లాడుతూ అత్యంత నాణ్యమైన కంటి అద్దాలు తమ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే లీలా మోహన్ కృష్ణ దృష్టిలోపం వున్నవారికి కంటి అద్దాలను పంపిణీ



చేశారు.వాకాడు కోట మండలాల్లో 25 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా ఆదివారం మండల పరిధిలోని సాయిబులపాలెం సమీపంలో గిరిజన కాలనీలో కోట రమేష్ ఐ కేర్ నేత్ర వైద్య నిపుణులు వి రమేష్ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి కంటి సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడే వారిని గుర్తించి వారికి కంటిలో శుక్లాలు ఉన్న వారిని వాసన్ ఐ కేర్ కంటి ఆసుపత్రికి ఆపరేషన్ నిమిత్తం తరలించారు. ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి నేత్ర వైద్య నిపుణులు రమేష్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001